క్లుప్తంగా

నేడు బీజేపీ మోర్చాల సమావేశం

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని బీజేపీ అనుబంధ మోర్చాల సంయుక్త సమావేశం మంగళవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతెపాక సాంబయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోదీ ప్రభుత్వం 9 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ హాజరవుతారని అన్నారు.

మునుగోడు ఎంపీడీఓగా భాస్కర్

మునుగోడు : మునుగోడు ఎంపీడీఓగా ఆర్.భాస్కర్‌ను నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమకరణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని చంద్రాయణగుట్టలో పనిచేస్తున్న భాస్కర్ మునుగోడు మండల పరిషత్‌కు బదిలీపై వచ్చారు. ప్రస్తుత ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయ్ భాస్కర్‌ను ఇదే కార్యాలయ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఎంపీడీఓ భాస్కర్ మంగళవారం బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది.

రేపు వైద్యారోగ్య దినోత్సవం

మర్రిగూడ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14న దేవరకొండలో నిర్వహించే వైద్యారోగ్య దినోత్సవాన్ని విజయవంతం చేయాలని దేవరకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణకుమారి సోమవారం తెలిపారు. వైద్యులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మొదలయ్యాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 164 మంది విద్యార్థులకుగాను 32 మంది గైర్హాజరు కాగా, ద్వితీయ సంవత్సరంలో 66 మందికి 13మంది గైర్హాజరు అయ్యారు. మొత్తం 230 మంది విద్యార్థులకు 45 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.శివస్వరూపరాణి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ వి.లింగస్వామి తెలిపారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



దీక్షలో కూర్చున్న గ్రామస్తులు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామస్తులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 53వ రోజు కొనసాగాయి. ఈ దీక్షలో ఆ గ్రామానికి చెందిన మేదరి సంఘం నాయకులు కూర్చున్నారు. ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి పట్టణంలో అమ్మనబోలు చౌరస్తా నుంచి మునుగోడు చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే నార్కట్‌పల్లి రూపురేఖలు మారి మోడల్‌గా మారుతుందని ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నార్కట్‌పల్లి పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో చిరు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట బొక్క భూపాల్‌రెడ్డి, దుబ్బాక శ్రీధర్, కన్నబోయిన సైదులు, రామలింగయ్య, గుస్‌రెడ్డి లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

చండూరు(గట్టుప్పుల) : గట్టుప్పల మండల పరిధిలోని అంతంపేట గ్రామానికి చెందిన మాతంగి మైసయ్య (75) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవిముదిరాజ్ పరామర్శించి 10 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో రవీందర్, ఎంపీటీసీ నేనావత్ బంతిలాల్, ఉప సర్పంచ్ వీరమళ్ళ రాజు, భీమనపల్లి మల్లేశ్, రామచంద్రు, అంజయ్య, బీమనపల్లి సతయ్య, జంగయ్య, వెంకులు, ఇంగిలి నాగరాజు, బండారు మల్లేశం ఉన్నారు.



నగదు అందజేస్తున్న నారబోయిన రవి

నిరుపయోగంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు

- అవగాహన లేకపోవడంతో వినియోగించని పాదచారులు
- జాతీయ రహదారిని దాటుతూ మృత్యువాత పడుతున్న ప్రజలు



కేతేపల్లిలో హైవేపై నిరుపయోగంగా ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జీ

కేతేపల్లి : జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన పాదచారుల వంతెనలు నిరుపయోగంగా మారాయి. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించినప్పటికీ వాటి వినియోగంపై అవగాహన కల్పించేవారు లేకపోవడంతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు అలంకారప్రాయంగా మారాయి. పాదచారుల వంతెన(ఫుట్ ఓవర్ బ్రిడ్జి) వినియోగించకుండా ప్రజలు రోడ్డు దాటుతుండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో జాతీయ రహదారిపై చౌటుప్పల్, చిట్యాలలో రెండు చొప్పున, కేతేపల్లిలో ఒక వంతెనను ఏడేళ్ల క్రితం జీఎమ్మార్ కాంట్రాక్టు సంస్థ ఫుట్ ఓవర్ బ్రిడ్జీలను ఏర్పాటు చేసింది. ఒక్కో వంతెనకు రూ.90లక్షల చొప్పున రూ.4.5 కోట్లు వరకు ఖర్చు చేశారు. ఈ వంతెనలను నిర్మించినప్పటికీ ప్రయాణికులకు, స్థానికులకు సరైన అవగాహన లేకపోవడంతో వినియోగం లేకుండా పోయింది. ఫుట్ ఓవర్ బ్రిడ్జీలను దివ్యాంగులు, వృద్ధులు ఎక్కలేరు. పిల్లలు, సామాన్యులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ డివైడర్‌ల పైనుంచే ప్రమాదకరంగా జాతీయ రహదారిని దాటుతున్నారు. త్వరగా హైవేను దాటాలని పాదచారులు ప్రయత్నిస్తుండగా అతివేగంగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాల నివారణకు రోడ్డు దాటే పాదచారులు వంతెన ఉపయోగించాలని వంతెన నిర్మించిన తొలినాళ్లలో పోలీసులు అవగాహన కల్పించేవారు. కొంతకాలం ప్రచారం చేసిన తర్వాత పోలీసులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి ఎప్పటిలాగే మారింది.



ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న విద్యార్థులు (ఫైల్)

ఫ్లెక్సీలకు అడ్డాగా పాదచారుల వంతెనలు

వివిధ పార్టీల బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు జరిగినప్పుడు, ప్రజాప్రతినిధుల పుట్టిన రోజు వేడుకలకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలకు ఇరువైపులా ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. దీంతోపాటు రాత్రివేళ మందుబాబులకు ఇవి అడ్డాగా మారాయి. రోడ్డును దాటే పాదచారుల కంటే నాయకుల ఫ్లెక్సీలు, మందుబాబుల కోసమే ఫుట్‌ఓవర్ బ్రిడ్జీ ఏర్పాటు చేసినట్లు ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పోలీసు అధికారులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జీలను వినియోగించేలా అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అండర్‌పాస్ వంతెనలు నిర్మించాలి



హైవేపై జరిగే ప్రమాదాలలో అత్యధిక శాతం పాదచారులే మృత్యువాత పడుతున్నారు. వృద్ధులు, కీళ్ల నొప్పులతో బాధపడేవారు ఈ వంతెనలను ఎక్కలేక ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జీల స్థానంలో అండర్ పాస్ వంతెనలు నిర్మిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– టి.నర్సింహాచారి, కేతేపల్లి

ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలను వినియోగించాలి



రోడ్డుపై ప్రమాదాల నివారణ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలను ఏర్పాటు చేశారు. కాస్త ఆలస్యమైనా సరే విద్యార్థులు, ప్రయాణికులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలను వినియోగించి రోడ్డు దాటాలి. వంతెనపై రాత్రివేళ ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీకాంత్‌గౌడ్, ఎస్‌ఐ, కేతేపల్లి

ఒంటిపూట బడులు నిర్వహించాలి

నల్లగొండ : ఎండల తీవ్రత ఇంకా ఉన్నందున ఒంటిపూట బడులు నిర్వహించాలని కోరుతూ డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి విద్యాశాఖ కార్యదర్శికి సోమవారం లేఖ పంపారు. వేసవి తీవ్రత ఇంకా కొనసాగే అవకాశం ఉన్నందున వారంరోజులపాటు ఒంటిపూట బడులు నిర్వహించాలని కోరారు.

పైలేరియాపై అవగాహన

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి పీహెచ్‌సీలో పైలేరియా వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించినట్లు మెడికల్ ఆఫీసర్ ఎమ్.ప్రదీప్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైలేరియా వ్యాధిగ్రస్తులకు చికిత్స సామగ్రి అందజేసినట్లు పేర్కొన్నారు.

రాధమ్మకు నివాళి

కట్టంగూర్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధురాలు గోదల రాధమ్మ 11వ వర్ధంతిని సోమవారం మండలంలోని పందెనపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాధమ్మ చిత్రపటానికి గ్రామస్తులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుంభం శ్రీనివాసరెడ్డి, కొండి యాదవరెడ్డి, గోదల కృష్ణారెడ్డి, సోమిరెడ్డి, వరమ్మ, బండారి ఊర్మిళ, బాయమ్మ, గద్దపాటి దాసు, నర్సయ్య, యాదమ్మ పాల్గొన్నారు.

నకిరేకల్‌లో 2కే రన్



2కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నకిరేకల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని 2కే రన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాఘవరావు, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐలు శంకర్, గోపికృష్ణ పాల్గొన్నారు.

చదువుల్లో రాణించాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల

రామగిరి(నల్లగొండ): విద్యార్థులు చదువుల్లో రాణించాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని అరోరా పాఠశాలలో ఏర్పాటు చేసిన అక్షరాభ్యాసం సరస్వతీ పూజ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గొర్రె అశ్విని వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ గోగుల శ్రీనివాస్, రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, ట్రస్మా నాయకులు యానాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దుబ్బాక' జన్మదిన వేడుకలు

నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రక్తదానం చేశారు. రాత్రి క్లాక్ టవర్ సెంటర్లో కేక్ కట్ చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నల్లగొండ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ మనిమద్ది సుమన్, పున్న కైలాస్‌నేత, వైస్ ఎంపీపీ జిల్లపల్లి పరమేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆదిమల్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగదేవమ్మ జాతర



గంగదేవమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు



బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని పానగల్లు ఉదయ సముద్రం సమీపంలో గల గంగదేవమ్మ ఆలయం వద్ద సోమవారం జాతరను ఘనంగా నిర్వహించారు. యాదవులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పాల్గొని గంగ దేవమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద రూ.20 లక్షలతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ నాగయ్య, బాతుక జానయ్య, మల్లయ్య, ముత్యాలు, నరసింహ, యాదయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాచకాల్వలో రైతుల శ్రమదానం



గడ్డిని తొలగిస్తున్న రైతులు

శాలిగౌరారం : శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే ప్రధాన రాచకాల్వ హెడ్‌రెగ్యులేటర్ వద్ద మండలంలోని జాలోనిగూడెం గ్రామానికి చెందిన రైతులు సోమవారం బీఆర్‌ఎస్ మండల నాయకుడు చామల వెంకటరమణారెడ్డి నేతృత్వంలో శ్రమదానం చేశారు. శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చేందుకు యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడ వద్ద మూసీ నదిపై హెడ్‌రెగ్యులేటర్ నిర్మించారు. ఇక్కడి నుంచి సుమారు 30 కిలోమీటర్లు రాచకాల్వ నిర్మించారు. ఈ రాచకాల్వకు రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాలకు చెందిన పలు చెరువులు, కుంటలు అనుసంధానమై ఉన్నాయి. ప్రస్తుతం మూసీనదిలో వరదనీరు ప్రవహిస్తుండడంతో శాలిగౌరారం ప్రాజెక్టులోకి హెడ్‌రెగ్యులేటర్ ద్వారా వరదనీటిని మళ్లించారు. అయితే హెడ్‌రెగ్యులేటర్ సమీపంలో గుర్రపుడెక్క, పచ్చిగడ్డి పేరుకుపోయి వరదనీటికి అడ్డుగా నిలవడంతో రైతులు శ్రమదానం చేసి గుర్రపుడెక్కను తొలగించి రాచకాల్వలో వరదనీరు వచ్చేలా పాటుపడ్డారు. శ్రమదానంలో రైతులు జమ్ము నర్సింహ, సైదులు, సతీష్, కడారి వినోద్, కల్లూరి సతీష్‌లతో పాటు మరో పదిమంది రైతులు పాల్గొన్నారు.

సాగు పనుల్లో రైతన్నలు బిజీబిజీ



చీకటిమామిడిలో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు



మునుగోడులో అచ్చు తోలుతున్న రైతు



పులిపలుపులలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు



విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

మునుగోడు : మండలంలోని రైతులు వానాకాలం సాగు పనుల్లో బిజీబిజీ అయ్యారు. ఆదివారం సాయంత్రం మునుగోడు మండల వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురవడంతో అప్పటికే దుక్కులు దున్నుకున్న రైతులు పత్తి విత్తనాలు నాటిస్తుండగా మరికొందరు ట్రాక్టర్ల ద్వారా దుక్కులు దున్నుకుంటున్నారు. ఇంకొంత మంది రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఏ రైతు వ్యవసాయ భూమిలో చూసినా పత్తి నాటే కూలీలు, ట్రాక్టర్లతో దుక్కులు దున్నడం, అచ్చులు తోలుకునే రైతులు కనిపిస్తున్నారు. వ్యవసాయ పనులు మొదలు కావడంతో కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది.

మా బడికి పంపించండి..



చండూరు : తేరట్‌పల్లి గ్రామంలో కరపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

చండూరు : మా బడికి పంపించండి .. రెండు జతల దుస్తులు, భోజనం, పుస్తకాలు, నోట్స్ ఉచితంగా అందజేస్తామని తేరట్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తేరట్‌పల్లి, శేరిగూడెం గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. బడికి రావాలే కానీ పనులకు పోవద్దని చిన్నారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు లచ్చిరామ్‌నాయక్, వెంకటేశ్వర్‌రావు, సాయిరాం, యాదగిరి తదితరులు ఉన్నారు.

నకిరేకల్ : విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పాలెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వంటల వెంకటేశ్వర్లు అన్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా పాలెం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గదులను అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహమూర్తి, నర్సయ్య, సుష్మ, పద్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : ప్రభుత్వం ఉచితంగా అందించే యూనిఫాం, పాఠ్యపుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, వార్డు సభ్యులు రెడ్డిపల్లి మనోహర్, ఐతగోని సైదులు, నాగరాజు, హెచ్‌ఎం ఆర్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణ ప్రగతికి ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 16న పట్టణ ప్రగతి దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో పలు విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా 16వ తేదీన 8 గంటలకు ఎన్జీ కాలేజీ మైదానంలో రంగోలి పోటీలు, మానవహారం ఉంటుందని తెలిపారు. అనంతరం ఎన్జీ కాలేజీ నుంచి పెద్ద గడియారం సెంటర్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. అక్కడే కళాభారతి స్థలంలో పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహిస్తామని, మున్సిపల్ ఉద్యోగులు సకాలంలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎంసీ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఏసీపీ నాగిరెడ్డి, డీఈలు వెంకన్న, నరసింహారెడ్డి, అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాల వద్ద జనం బారులు



మర్రిగూడ : మీసేవ వద్ద గుంపులుగా ఉన్న ప్రజలు

కట్టంగూర్ : ప్రభుత్వం బీసీ కుల, చేతి వృత్తిదారులకు రూ.లక్ష అందజేస్తామని తెలపడంతో మీసేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయానికి సోమవారం ప్రజలు భారీగా తరలివచ్చారు. కుల ఆదాయ సర్టిఫికెట్ల కోసం మీ సేవ కేంద్రం వద్ద ప్రజలు బారులుదీరారు. దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 20వ తేదీ వరకు అవకాశం కల్పించింది. తక్కువ సమయం ఉండడంతో సర్టిఫికెట్ల కోసం మీసేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలతో రద్దీగా ఉన్నాయి.

మర్రిగూడ : బీసీ కుల వృత్తులకు వారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించడంతో మండలంలోని మీసేవ కేంద్రాల వద్దకు ప్రజలు క్యూకట్టారు. దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తున్నారు. కుల, ఆదాయ దరఖాస్తులను సోమవారం డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్, బషీర్ అలీ పరిశీలించారు. ఈ నెల 20 నుంచి 26 వరకు ఎంపీడీఓ, మండల ప్రత్యేక అధికారి లబ్ధిదారుల జాబితాను పరిశీలించనున్నట్లు సమాచారం.

బస్‌షెల్టర్ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



కట్టంగూర్ : వినతి పత్రం అందిస్తున్న నాయకులు

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో చెర్వుఅన్నారం గ్రామ స్టేజీ వద్ద ఉన్న బస్‌షెల్టర్‌ను కూల్చివేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, ఇటికాల సురేందర్, ఊట్కూరు యాదయ్య, గుడుగుంట్ల రామకృష్ణ, ఊట్కూరు శ్రీను, చిలుకూరి సైదులు ఉన్నారు.

నల్లగొండ టౌన్ : కట్టంగూర్ మండలం చెర్వు అన్నారం గ్రామ స్టేజీ వద్ద కూల్చివేసిన బస్ షెల్టర్‌ను తిరిగి నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చెర్వు అన్నారం గ్రామ ప్రజల కోరిక మేరకు నంద్యాల ఎల్లారెడ్డి–పిచ్చమ్మ జ్ఞాపకార్థం అప్పటి నల్లగొండ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి కుటుంబసభ్యులు బస్‌షెల్టర్ నిర్మించారని గుర్తు చేశారు. బస్ షెల్టర్ 10 గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.

మహిళా సంక్షేమ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

కట్టంగూర్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కట్టంగూర్‌లో మంగళవారం నిర్వహించే నియోజకవర్గ స్థాయి మహిళా సంక్షేమ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని తహసీల్దార్ పి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, ఎంపీడీఓ పోరెళ్ల సునిత, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దళితులకు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలి

చిట్యాల : సంక్షేమ పథకాల అమలులో దళితులకు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ డిమాండ్ చేశారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో సోమవారం జరిగిన దివ్యాంగుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నకాపర్తి గ్రామంలో ఇళ్ల స్థలాలను అర్హులైన దళితులకు, దివ్యాంగులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కొత్త సుధాకర్, సత్తయ్య పాల్గొన్నారు.

ఎరువులు సకాలంలో అందించాలి

నకిరేకల్ : రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు అందించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నకిరేకల్‌లోని యానాల మల్లారెడ్డి స్మారక భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని, బ్యాంకు రుణాలు అందించాలన్నారు. కల్తీ విత్తనాలు, పురుగుల మందుల విక్రయాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం వెంకటేశ్వర్లు, సతీష్, వెంకటాచారి, నర్సయ్య, వెంకన్న పాల్గొన్నారు.